పల్లెవించిన సంక్రాంతి

- సొంతూళ్లకు చేరుకుంటున్న కుటుంబాలు
- భోగి మంటలకు జోరుగా ఏర్పాట్లు

మండపేట/రాయవరం/కాజులూరు: ఎప్పుడెప్పుడు పండగ, ఏడాది పండగ అంటూ ఎదురు చూసిన సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. పెద్ద పండగ కోసం బంధువుల రాకతో పల్లెల్లో కోలాహలం నెలకొంది. సంక్రాంతిని పురస్కరించుకుని మహిళలు వేస్తున్న రంగురంగుల ముగ్గులతో ఇళ్ల ముంగిళ్లు ముచ్చట గొలుపుతున్నాయి. శనివారం భోగభాగ్యాల భోగి, ఈ నెల 15న సంక్రాంతి, 16న మకర సంక్రాంతి, 17న ముక్కనుమ పండగలను నిర్వహించుకునేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. సంక్రాంతి పండగల్లో తొలిఘట్టం భోగి. చీకట్లను చీల్చుకుంటూ వెలుగులు నింపే భోగిమంటలు పాతకు స్వస్తి పలికి కొత్తదనానికి నాంది పలుకుతాయని నమ్మకం. భోగిమంటల్లో నీళ్ల కాచుకుని తెలతెలవారకముందే తలారా స్నానం చేసి కొత్త దుస్తులు ధరించి, చుట్టుపక్కల వారిని పిలిచి తమ ఇంటిలోని చిన్నారులపై భోగిపళ్లు పోసే కార్యక్రమం ఇంటింటా వేడుకగా జరుగుతుంది. భోగిపండగ కోసం శుక్రవారం ఎక్కడ చూసినా కోలాహలం నెలకొంది. చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా కలప, తాటి దుంగలు, పిడకల సేకరణలో నిమగ్నమయ్యారు. దుస్తులు, స్వీట్లు తదితర దుకాణాలు, వినియోగదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. పండగ కోసం స్వగ్రామాలకు వెళ్లే వారు, వేరే ప్రాంతాల నుంచి స్వస్థలానికి వచ్చే వారితో మండపేటలోని బస్టాండు వద్ద సందడి నెలకొంది. విద్యుత్ గృహోపకరణాలు, సెల్‌ఫోన్లపై వివిధ షాపుల వారు ఆఫర్లు ప్రకటించడంతో వినియోగదారుల సందడి కనిపించింది.



మొగలిపాలెంలో భోగిమంట కోసం దుంగను తరలిస్తున్న పిల్లలు

సంక్రాంతికి ప్రతీక హరిదాసు, గంగిరెద్దు

సంక్రాంతి పండగ వచ్చిందంటే ఇళ్ల ముందు హరిదాసు, గంగిరెద్దులకు సంబంధించిన వారు దర్శనం ఇస్తారు. హరిదాసు సంక్రాంతి కీర్తనలతో అలరిస్తూ పిల్లలు, పెద్దలు వేసిన బియ్యం, పిండివంటలు తీసుకుని సంతృప్తి పడతారు. గంగిరెద్దుతో ఆటలు ఆడించేవారు గంగిరెద్దను ఇంటికి తీసుకుని వచ్చి అమ్మవారికి దండం పెట్టు..అయ్యవారికి దండం పెట్టు అంటూ విన్యాసాలు చేయిస్తారు. పిల్లాపాపలు ఆనందంగా ఉండాలంటూ దీవెనలు అందిస్తారు. దివంగతులైన తమ తాతముత్తాల ఆత్మలకు శాంతి కలుగుతుందనే నమ్మకంతో వారి పేరిట దానధర్మాలు నిర్వహిస్తారు.

కోడిపందేలకు రె'ఢీ': ఏటా మాదిరిగానే సంక్రాంతి పండగకు మూడు రోజులూ కోడిపందేల నిర్వహణకు బరులు సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మండపేట అర్బన్, రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని పలు గ్రామాల్లో బరులు ఏర్పాటు చేశారు.

గ్రామాల్లో కోలాహలం

తొలి పండగైన భోగిపండుగ కోసం రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం పట్టణ మరియూ మండల గ్రామాల్లో వాడవాడలా సంక్రాంతి కోలాహలం నెలకొంది. ఎక్కడ చూసిన దుస్తులు, స్వీట్లు తదితర దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. భోగి మంటలు వేసేందుకు చిన్నాపెద్దా తేడాలేకుండా అంతా కలప సేకరణలో నిమగ్నమయ్యారు. ధనుర్మాసం ప్రారంభమైన నాటి నుంచి పొలాల్లోకి వెళ్లి తెచ్చిన తాటి దుంగలు, ఇతర కలపలతో శుక్రవారం అర్ధ రాత్రి సమయంలో భోగి మంట వేశారు.

వంతెనకు అప్రోచ్ నిర్మించాలి



అప్రోచ్ లేక ప్రమాదకరంగా మారిన వంతెన

కె.గంగవరం: మండలంలోని కూళ్ల గ్రామ పంచాయతీ శివారు మల్లవరం వద్ద ఉన్న వంతెనకు అప్రోచ్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఐదేళ్ల క్రితం నాబార్డు నిధులతో నూతన వంతెన నిర్మాణం జరిగింది. అయితే అప్పట్లో నాసిరకం కంకర వాడడం వల్ల కొంత వరకు అప్రోచ్ కొట్టుకుపోయింది. మిగిలిన సగం గత వర్షాకాలంలో కురిసిన వర్షాలకు పంటకాలువలోనికి కొట్టుకుపోయింది. అప్రోచ్ లేకపోవడంతో వాహనాదారులు ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారని మాజీ సర్పంచ్ చిట్టూరి వెంకటరామయ్య అంటున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు అప్రోచ్ నిర్మించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తాతరాజు

మండపేట: లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి శుక్రవారం మండపేట లయన్స్ క్లబ్ ఘనంగా నిర్వహించింది. క్లబ్ అధ్యక్షుడు గుండు వీరతాతరాజు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థలో వందమంది పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ దాసరి తిరుమలరావు సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చెన్నా రాంబాబు, సీహెచ్ బాపిరాజు, అధికారి శ్రీనివాస్, కేవీవీ సత్యనారాయణ, యు.పాపరాజు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోరు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ జ్ఞాపికను అందుకుంటున్న సుభాష్

కపిలేశ్వరపురం: అంగరలో సిద్దిరెడ్డి నరస బాబు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. శనివారం వరకు కొనసాగే పోటీల్లో భాగంగా శుక్రవారం మూడు మ్యాచ్‌లు నిర్వహించారు. అంగర గ్రౌండ్-మండపేట మధ్య నిర్వహించిన లీగ్ మ్యాచ్‌లో అంగర గ్రౌండ్ టీం విజయం సాధించింది. యేసు-వాడపల్లి మధ్య నిర్వహించిన మ్యాచ్‌లో వాడపల్లి టీం గెలిచింది. అంగర గ్రౌండ్ - బాలకృష్ణ టీంల మధ్య నిర్వహించిన తొలి క్వార్టర్ ఫైనల్లో అంగర గ్రౌండ్ విజయం సాధించింది. ఆయా మ్యాచ్‌లలో మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచిన సంకాబత్తుల సుభాష్, గోపి, ఫణి కిశోర్‌లకు జ్ఞాపికలను అందజేశారు.

కొట్టి గాయపరిచారని ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: పొలం వద్ద తగాదా నేపథ్యంలో తనను కర్రతో కొట్టి గాయపరిచారని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వినోద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి..నెలపర్తిపాడుకు చెందిన నీల శ్రీనుకు గణపతినగరంలో పొలం ఉంది. ఈ నెల 11న ఆ పొలానికి వెళ్లే మార్గాన్ని టేకుమూడి బాలకృష్ణరాజు, వాసంశెట్టి అనంతలక్ష్మి, టేకుమూడి సత్యనారాయణ జేసీబీతో తవ్వుతుండగా అడ్డుకున్న తనను కర్రతో తలపై కొట్టి గాయపరిచారని నీల శ్రీను ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైల్వే ట్రాక్ వద్ద గుర్తుతెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

మండపేట: మండలంలోని ద్వారపూడి రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్ వద్ద గుర్తు తెలియని మహిళ మృతిపై శుక్రవారం రాజమహేంద్రవరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఏదైనా రైలు నుంచి జారిపడి, లేదా ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని మృతిచెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కృష్ణమూర్తి మాస్టారు మృతి



కృష్ణమూర్తి మాస్టారు(ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గ్రంధి కృష్ణమూర్తి మాస్టారు(76) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ద్రాక్షారామ శ్రీ వీవీఆర్ హైస్కూల్‌లో తెలుగు పండిట్‌గా 28 సంవత్సరాలు పనిచేసి 2005లో రిటైర్ అయ్యారు. ఆయన భార్య లక్ష్మీనరసమాంబ అదే పాఠశాలలో హిందీ పండిట్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. తెలుగు బోధనతో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనర్‌గా పలువురు విద్యార్థులను తీర్చిదిద్దారు. కలెక్టర్ సతీష్‌చంద్ర చేతుల మీదుగా బెస్ట్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు అందించిన సేవలకు ఉత్తమ అవార్డు పొందారు. గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వైఎస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ నున్న సత్యవతి, పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్ ప్రారంభం



ఆరోగ్య శ్రీ హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య శ్రీ హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్‌తో పాటుగా ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన మెషినరీని మంత్రి వేణు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో రోగుల వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరభద్రుడు, డాక్టర్ ఎస్. ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తొగరు మూర్తి, చెల్లుబోయిన ప్రకాశ్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గృహ నిర్మాణాలు



ఇళ్ల నిర్మాణాలపై సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి

కపిలేశ్వరపురం: జగనన్న కాలనీల్లో పేదల ఇళ్లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం గృహ నిర్మాణాలపై సంబంధిత అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉగాది నాటికి కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తికావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆ లక్ష్య సాధనలో సంబంధిత అధికారులు, క్షేత్ర స్థాయిలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కృషి చేయాలన్నారు. లబ్ధిదారుల్లో అవగాహన కల్పించడం, నిర్మాణ క్రమంలో వారి వెన్నుతట్టి నిలవడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోగలమని ఎంపీడీఓ అన్నారు. ఇళ్ళ నిర్మాణాల స్థితిగతులను హౌసింగ్ ఏఈ హౌసింగ్ ఏఈ పీవీవీఎస్ఎస్మూర్తి సమావేశానికి వివరించారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ఎంవీ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయ సాధనకు జగనన్న కృషి



సమావేశంలో మాట్లాడుతున్న బుల్లిరాజు

కాజులూరు: రైతును రాజు చెయ్యాలన్నా దివంగత నేత వైఎస్సార్ ఆశయ సాధన కోసం ముఖ్యమంత్రి జగనన్న అహర్నిశలూ కృషి చేస్తున్నారని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏఓ వి.అశోక్ అధ్యక్షతన జరిగిన మండల వ్యవసాయ సలహామండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయ సాధనలో భాగంగా ముఖ్యమంత్రి జగనన్న రైతుల కోసం ప్రతీ గ్రామంలోనూ రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. రైతులకు అనేక సూచనలు, సలహాలు అందించేందుకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో వ్యవసాయ సలహా మండళ్లను నియమించారన్నారు. ప్రభుత్వ పథకాలు రైతులకు సక్రమంగా అందించేందుకు, వ్యవసాయ రంగానికి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ఈ కమిటీ దోహద పడుతున్నాయన్నారు. దాళ్వాసాగులో ఎరువుల కొరత రాకుండా ఆర్‌బీకేలు ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. ఎంపీపీ మాత భారతి మురళి, తర్లంపూడి, కాజులూరు గ్రామ సర్పంచ్‌లు నరాల బాలరాజు, దండంగి సరోజినిచిన్నారావు, పలు గ్రామాల వీఆర్వోలు, వీఏఏ రైతులు పాల్గొన్నారు.

ఆర్‌టీఐ చట్టంపై అవగాహన



రాఘవేంద్రరావుకు నియామక పత్రాలను అందిస్తున్న సుమిత్రానందన్



సుమిత్రానందన్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న సుబ్బారావు

రామచంద్రపురం: సమాచార హక్కు చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బీహెచ్ సుమిత్రానందన్ అన్నారు. అసోసియేషన్ స్థాపించి రెండేళ్లు అయిన సందర్భంగా పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు విద్యాసంస్థల ప్రాంగణంలో శుక్రవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు కేశవరాఘవేంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సుమిత్రానందన్‌తో పాటుగా రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొండబాబు, జిల్లా అధ్యక్షుడు సలాది ప్రసన్నకుమార్, లీగల్ అడ్వయిజర్ రాజేష్ పాల్గొన్నారు. అసోసియేషన్ పట్టణాధ్యక్షుడిగా నియామక పత్రాన్ని రాఘవేంద్రరావుకు సుమిత్రానందన్ అందజేశారు.

మండపేట అధ్యక్షుడిగా సుబ్బారావు

మండపేట: జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం మండపేట అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మద్దుల సుబ్బారావు నియమితులయ్యారు. రామచంద్రపురంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వ్యవస్థాపకుడు అధ్యక్షుడు బీహెచ్ సుమిత్రానందన్ నియామక పత్రం అందజేసినట్టు సుబ్బారావు తెలిపారు. పట్టణంలో సంఘ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ నవీన్‌రెడ్డి

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం రాయవరం ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ వెంకటరమణ, ఏఎంసీ డైరెక్టర్ సుబ్బరామారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినంలో స్నేహితుడి పేరిట క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. హెచ్ఎం పప్పు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఈ విషయాన్ని టోర్నమెంట్ నిర్వాహకులు వుండవిల్లి రాంబాబు, కేవీఆర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ తేతల నవీన్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ తమలంపూడి గంగాధరరెడ్డి మాట్లాడారు. అనంతరం బెల్లపు సూర్యప్రకాశరావు జ్ఞాపకార్థం 10 ఓవర్ల పరిమిత క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. తొలి రోజు నాలుగు మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ నెల 17 వరకు పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్స్ తెలిపారు. మంతెన అచ్యుతరామరాజు, పడాల కమలారెడ్డి పాల్గొన్నారు.

పల్లెల్లో నవరత్నాల సంక్రాంతి

- మంత్రి వేణు



సంక్షేమ పథకాలను లబ్ధిదారుకు వివరిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్నాల పథకాలతో పల్లెల్లో సంక్రాంతి సందడి వెల్లివిరుస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని కాపవరంలో మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. రైతులకు సమయానికి నాణ్యమైన ఎరువులు, మద్దతు ధర, పంట నష్టానికి అదే సీజన్‌లో నష్ట పరిహారం అందిస్తూ రైతులకు నిజమైన భరోసా ఇస్తున్నారన్నారు. విద్య, వైద్యం, ఆర్థికంగా స్థిరపడడానికి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే సాయం అందిస్తున్నారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ, సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి అధికారులకు ఆదేలిస్తూ మంత్రి వేణు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ యనమదల మంగాదేవి, ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్, సొసైటీ చైర్మన్ గీసాల శివ, జెడ్పీటసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాకా బాబీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి మాగాపు అమ్మిరాజు, జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

డివిడెండ్ పంపిణీ

కె.గంగవరం: స్థానిక సొసైటీ రైతులకు శుక్రవారం డివిడెంట్ పంపిణీ చేశారు. 930 మంది రైతులకు 2020–21, 2021–22 సంవత్సరాలకు గాను రూ.6 లక్షలు ప్రకటించారు. ఈ సొమ్మును రైతుల ఖాతాల్లోకి సొసైటీ అధ్యక్షుడు ఈదర రమేష్, డైరెక్టర్లు జమ చేశారు.

19న పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం


కపిలేశ్వరపురం: ఈ నెల 19న వాకతిప్ప పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు వైద్యాధికారి పి.చంద్రమౌళి శుక్రవారం తెలిపారు. పీహెచ్‌సీలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో ఆసుపత్రి నిర్వహణపైన, రోగుల సదుపాయాల మెరుగుదలపైనా చర్చించనున్నట్టు తెలిపారు.

చిత్తశుద్ధి లేదు

మండపేట: టిడ్కో లబ్ధిదారుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్లాట్లు అప్పగించి నెలలు గడుస్తున్నా వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తొలి విడత 4,064 ప్లాట్లకు గాను రెండు వేల మందికి పంపిణీ చేశారని, మిగిలిన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

ముస్లిం మైనార్టీలకు మేలైన సంక్షేమం

- జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్



సత్కార సభలో మాట్లాడుతున్న జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్. చిత్రంలో బోర్డు డైరెక్టర్లు

అమలాపురం టౌన్: ముస్లిం, మైనార్టీల కోసం ముఖ్యమంత్రి జగన్ మేలైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. స్థానిక 12వ వార్డులో గల మస్జిదె షియా ఇస్నా అషరి మసీదు ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్, డైరెక్టర్లకు శుక్రవారం సాయంత్రం ఘన సత్కారం జరిగింది. ఆ మసీదు అధ్యక్షుడు ఎండీ నిస్సార్ హుస్సేన్ అధ్యక్షతన అదే మసీదులో జరిగిన అభినందన సభలో జిల్లా చైర్మన్ ఖాదర్ మాట్లాడారు. జిల్లాలోని వక్ఫ్ భూముల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన తమ బోర్డు ద్వారా పాటు పడతామని ఆయన స్పష్టం చేశారు. జిల్లా బోర్డు చైర్మన్ ఖాదర్‌తో పాటు వైస్ చైర్మన్ సజ్జాద్ హుస్సేన్, డైరెక్టర్లు ఎండీ అలీషా, కర్రార్ హుస్సేన్, జాఫర్ హుస్సేన్, ఎండీ ఆశిక్ అలీ, ఎండీ యూసఫ్, షరీఫ్ ఎండీ హరన్, షేక్ ఇస్మాయిల్‌లను మసీదు పెద్దలు సత్కరించి అభినందించారు. సభలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు, మసీదు కార్యదర్శి కర్రార్ హుస్సేన్, అమీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారామ క్షేత్రంలో గోదాదేవి కల్యాణం



నిశ్చితార్థం వేడుకలో గణేశ్వరరావు దంపతులు

మండపేట: పట్టణంలోని బురగుంట చెరువు వద్ద గల శ్రీసీతారామక్షేత్రంలో గోదాదేవి, శ్రీరంగనాయకుల కల్యాణ వేడుకకు ఆలయ కమిటీ ఘనంగా ఏర్పాట్లు చేసింది. గోదాదేవి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారికి, అమ్మవారికి నిశ్చితార్థం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు దంపతులు, మల్లిపూడి వెంకటేశ్వరరావు దంపతులు నూతన వస్త్రాలతో పానకాలిచ్చి నిశ్చితార్థ పూజలు నిర్వహించారు. గణేశ్వరరావు మాట్లాడుతూ కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం నుంచి సీతారామక్షేత్రంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. రాత్రి 7.15 గంటలకు గోదాదేవి కల్యాణ వేడుక జరుగుతుందని అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆలయ అర్చకులు వరదాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పండగలు తెలుగు సంప్రదాయాలకు ప్రతీకలు



ఉప్పుమిల్లిలో సంక్రాంతి ముగ్గులపోటీ విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

కాజులూరు: పండగలు తెలుగు సంప్రదాయాలకు ప్రతీకలని ఉప్పుమిల్లి గ్రామ సర్పంచ్ పెంకే సత్యనారాయణ అన్నారు. ఉప్పుమిల్లి, జగన్నాథగిరి తదితర గ్రామాలలో ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు శుక్రవారం ముందస్తు సంక్రాతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు తెలుగు సంస్కృతి, గ్రామీణ పండగలు, సంప్రదాయాలను వివరిస్తూ వినూత్న రీతిలో ప్రదర్శనలు నిర్వహించారు. సంక్రాంతి పండగ వాతావరణం ఉట్టిపడేలా గొబ్బెమ్మలు పెట్టి, భోగిమంటలు వేసి చుట్టూ తిరుగుతూ జానపద గేయాలు పాడుతూ నృత్యాలు చేశారు. పలువురు విద్యార్థులు పోటాపోటీగా ముగ్గులు పెట్టి చూపరులను ఆకర్షించారు. పోటీలలో విజేతలకు ఉప్పుమిల్లి గ్రామ సర్పంచ్ పెంకే సత్యనారాయణ బహుమతులు అందజేశారు. జగన్నాథగిరి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ కొతాని అచ్యుతాంబ అరుణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తాళ్ళరేవు ఐసీడీఎస్ సీడీపీఓ మాధవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ అన్నపూర్ణ, కనకరత్నం, దుర్గాదేవి, మండల సర్పంచ్‌ల సమాఖ్య మాజీ అధ్యక్షుడు కొతాని గణేశ్వరరావు, టి వరలక్ష్మి పాల్గొని పలువురి చిన్నారులకు భోగిపళ్లు పోశారు.

నేడు గోదాదేవి, రంగనాథస్వామి వార్ల కల్యాణం



కల్యాణ మూర్తులుగా గోదాదేవి, రంగనాథస్వామివార్లు



కల్యాణానికి పసుపు కొడుతున్న ముత్తయిదువలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఆదివారపుపేట శ్రీ శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో వేంచేసియున్న గోదాదేవి, రంగనాథస్వామివార్ల దివ్య కల్యాణం శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆశ్రమ నిర్వాహకురాలు యశోదమ్మ, ఆలయ అర్చకుడు బొండుబాల ఆధ్వర్యంలో పెళ్లిరాట ముహూర్తం చేశారు. ముత్తయిదువలు పసుపు కొట్టి స్వామివారికి, అమ్మవారికి మంగళ స్నానాలు చేయించారు. నూతన వస్త్రాలతో పెళ్లికుమారుడిగా, పెళ్లి కుమార్తెగా అలంకరించారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు నుంచి తీసుకుని వచ్చిన కృష్ణయ్య నాదస్వరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామ పెద్దలు మంత్రాల గురువు కలకండ రామలింగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ ఉప్పు అర్ధనారీశ్వరబులిరాజు, గ్రామ సర్పంచ్ నక్కిన దొరబాబు, ఎంపీటీసీ సభ్యుడు బళ్ల సుధాకరరావు భక్తులు పాల్గొన్నారు.